సాక్షి
తూర్పుగోదావరి

ఆదివారం । 29 । జనవరి । 2023



వెండి హారతి కుందె బహూకరణ


అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరునికి నిత్యాన్న దాన పథకానికి గాదె శ్రీరాములు (పాలకొల్లు) శనివారం రూ.22,222లు విరాళం అందజేశారు. వెండి హారతి, కుందెలను సమర్పించారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం



ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు భీమవరం మండలం చిన్న అమిరానికి చెందిన జి.పద్మరాజు, లక్ష్మీకుమారి దంపతులు శనివారం రూ. 50 వేలు విరాళం ఇచ్చారు.

డెల్టాలకు 7,800 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శనివారం 7,800 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,300, మధ్య డెల్టాకు 1,500, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 6.10 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

మర్యాద పూర్వక కలయిక



విజయకుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్ భరత్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రైతు సాధికార సమితి విశ్రాంత ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.వి జయకుమార్ రాజమహేంద్రవరం విచ్చేసిన సందర్భంగా ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో కలెక్టర్ మాధవీలత, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్ శనివారం ఉదయం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు.

భక్తులతో రత్నగిరి కిటకిట



వ్రతాలాచరిస్తున్న నవదంపతులు, భక్తులు

అన్నవరం: రథసప్తమి పర్వదినానికి పెళ్లిళ్ల హడావుడి తోడై శనివారం రత్నగిరి కిటకిటలాడింది. సత్యదేవుని సన్నిధికి పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో నవదంపతులు..వారి బంధుగణం తరలివచ్చారు. సుమారు 40 వేల మంది స్వామి వారిని దర్శించుకున్నారు. వారిలో సగం మంది పెళ్లి బృందాల వారే. భక్తుల రద్దీ కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం12 గంటల వరకు అంతరాలయ దర్శనం రద్దు చేశారు. అంతరాలయం దర్శనానికి రూ.200 టిక్కెట్ తీసుకున్న భక్తులను కూడా వెలుపల నుంచే దర్శనానికి అనుమతించారు. భక్తులు సత్యదేవుడిని దర్శించిన అనంతరం సప్తగోకులంలో గోవులకు ప్రదక్షణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి ప్రదక్షణ చేశారు. స్వామివారి వ్రతాలు 2,200 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ. 40లక్షల ఆదాయం సమకూరింది. సుమారు ఐదు వేల మంది భక్తులకు నిత్యాన్నదాన పథకంలో ఉచిత భోజన సౌకర్యం కల్పించారు. తిరుచ్చి వాహనం మీద సత్యదేవుని ప్రాకారసేవ ఘనంగా నిర్వహించారు. ఉదయం పది గంటలకు స్వామి, అమ్మవార్లను తిరుచ్చి వాహనం మీద ప్రతిష్ఠించి తూర్పు రాజగోపురం వద్ద ఆలయప్రాంగణంలోకి ఊరేగింపుగా తీసుకువచ్చారు. అక్కడ ప్రత్యేక పూజలు చేసిననంతరం ఆలయప్రాకారంలో మూడుసార్లు ఊరేగించారు. స్వామి, అమ్మవార్లను తిరిగి ఆలయానికి చేర్చారు.

వైభవంగా తలుపులమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ

తుని రూరల్: జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం లోవ దేవస్థానంలో ఆలయ పునర్నిర్మాణం, మహామండపం నిర్మాణ పనులతో ప్రధాన గర్భాలయంలో తలుపులమ్మ అమ్మవారి దర్శనాలను నిలిపి వేశారు. భక్తుల సందర్శనార్థం మెట్టమార్గంలో పెద్ద అమ్మవారి విగ్రహం వద్ద నిర్మించిన బాలాలయాన్ని ప్రారంభించి, తలుపులమ్మతల్లి విగ్రహాన్ని ఆగమ శాస్త్రం ప్రకారం ఉత్తరాయణ పుణ్యకాలంలో ప్రతిష్ఠించారు. వేద పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలు, పూర్ణాహుతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ పి.విశ్వనాథరాజు మాట్లాడుతూ ఆలయ పునర్నిర్మాణం, మహామండపం నిర్మాణం పనులు పూర్తయిన తర్వాత ప్రధాన గర్భాలయంలో అమ్మవారి దర్శనాలను పునరుద్ధరిస్తామన్నారు. అప్పటి వరకు భక్తులు బాలాలయంలో అమ్మవారిని దర్శించుకుంటారన్నారు. అభివృద్ధి పనులను మూడు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, తుని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి, కోఆప్షన్ సభ్యుడు ఏలూరి బాలు, వేంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ అన్నవరం శ్రీను, గాంధీ సత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, కోటనందూరు ఎంపీపీ లగుడు శ్రీనువాస్, వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ తుని, కోటనందూరు మండల కన్వనర్లు పోతల రమణ, గొర్లి రామచంద్రరావు తదితరులు అమ్మవారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నవతరం పెళ్లిసందడి

SUNDAY SPECIAL

ఆకాశం దిగి వచ్చి మబ్బులతో వెయ్యాలి మన పందిరి
ఊరంతా చెప్పుకునే ముచ్చటగా జరగాలి పెళ్ళంటే మరి
చెరి సగమని మనసులు కలుపుతు తెర తెరిచిన తరుణం
ఇదివరకెరుగని వరసలు కలుపుతూ మురిసిన బంధుజనం
మా ఇళ్ళ లేత మావిళ్ళ తోరణాలన్నీ పెళ్లి శుభలేఖలే
అక్షింతలేసి ఆశీర్వదించమను పిలుపులైనవి గాలులే

(సీతారామశాస్త్రి విరచిత గీతాన్ని వింటుంటే పెళ్లిసందట్లో మునిగి తేలినట్టుంటుంది కదూ.. ఇదిగో ఈ ఐదు రోజుల పెళ్లిసందడి తెలుసుకుంటే నిజంగానే ఆనందం గుండెల్లో పెళ్లి బాజాల్లా మోగుతుంది.)



- పెళ్లిలో పాత సంప్రదాయాలకు మళ్లీ పెద్దపీట
- సరికొత్త ఆలోచనలతో ఐదురోజులపాటు వేడుక
- ఆధునిక హంగులతో అవధులు లేని ఆనందం
- వీటి నిర్వహణకు పుట్టుకొస్తున్న ఈవెంట్ ఆర్గనైజర్లు
- ఆనాటి పెళ్లిళ్లను గుర్తుచేస్తూ సెట్టింగ్‌లతో కొత్తకళ
- ఖర్చు ఎక్కువైనా ఆసక్తి చూపుతున్న ఔత్సాహికులు

రాజమహేంద్రవరం రూరల్: పెళ్లంటే..జీవితంలో ఒకసారి జరిగే మధురఘట్టం.. ప్రతి ఒక్కరికీ గుర్తుండిపోయే తీపి జ్ఞాపకం. అందుకే పెళ్లిని గతంలో ఐదు రోజులపాటు సందడిగా జరుపుకొనేవారు. రానురానూ ఆ సందడి మాయమైంది. ఉదయం పెళ్లి జరిగితే సాయంత్రానికి హడావుడి ముగిసిపోతోంది. చుట్టాలు కూడా వచ్చి కనిపించి వెళ్లిపోతున్నారు. ఇప్పుడిప్పుడే ట్రెండ్ మారుతోందండోయ్. మళ్లీ ఆనాటి ఆచారాలకు పెద్దపీట వేస్తున్నారు. నాటి సంప్రదాయాలను నేటితరం అందిపుచ్చుకుంటోంది. ఐదు రోజుల పెళ్లి సందడి చాలా ఇళ్లలో ఇప్పటికే మొదలైంది. మెహందీ ఫంక్షన్‌తో మొదలై రకరకాల కార్యక్రమాలతో ఆనందాన్ని నింపుతోంది. పాశ్చాత్య సంస్కృతిని వదిలించుకుని నవతరం పాత సంప్రదాయాల బాటపడుతోంది

మీకెందుకు కష్టం.. మేమున్నాం కదా..

కాస్త డబ్బులు వెచ్చిస్తే అన్నీ మేమే చూసుకుంటామంటున్నాయి ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థలు. సంప్రదాయాలను పాటించాలని ఆసక్తి ఉన్నవారికి ఈ సంస్థలు అన్నీ సమకూర్చి పెళ్లికి నిండుదనాన్ని తీసుకువస్తున్నాయి. అభిరుచికి తగ్గట్టుగా తగిన ఏర్పాట్లు చేసి అతిథులతో ఆహా అనేలా చేస్తున్నాయి. భాజాభజంత్రీలు మొదలు..వధూవరుల ముస్తాబు, ఫంక్షన్‌హాల్, రిసెప్షన్‌తోపాటు వ్రతాలు ముగిసేవరకు ఈ సంస్థలే బాధ్యత వహిస్తున్నాయి. గతంలో పెళ్లి పనుల్లో వివిధ కులవృత్తుల వారు పాలుపంచుకునేవారు. ఇప్పుడు ఈ రంగం కూడా ఉపాధిగా మారిపోయింది. పెద్ద నగరాలకే పరిమితమైన ఈవెంట్ మేనేజ్‌మెంట్ చిన్నపట్టణాలకు, గ్రామాలకు కూడా విస్తరించింది. సెలబ్రిటీలు, వ్యాపారవేత్తలు, ప్రముఖుల ఇళ్లల్లోనే జరిగే ఐదు రోజుల పెళ్లిళ్లపై ఇప్పుడు మధ్యతరగతి కుటుంబాలూ ఆసక్తి చూపుతున్నాయి. ఒక్కో కార్యక్రమం ఒక్కోరోజు వేడుకలా నిర్వహిస్తూ ఆనందంలో తేలియాడుతున్నాయి. జిల్లాలో ఈ తరహా పెళ్లిళ్లు గతేడాది డిసెంబరులో మొగ్గ తొడుక్కున్నాయి. ఈ మాఘమాసంలో జోరందుకున్నాయి.

ఐదురోజుల పెళ్లి ఇలా

1వరోజు సంగీత్ :

ఇది పెళ్లి కూతురు ఇంటి వద్ద జరుగుతుంది. ఒకరకంగా చెప్పాలంటే అమ్మాయి బ్యాచిలర్ పార్టీ. అమ్మాయి మర్నాడు నుంచి మరో కుటుంబంలోకి వెళ్లిపోతుంది కాబట్టి కుటుంబంతో ఒకరోజు ఆడిపాడుతుంది. రాజుల కాలంలో కచేరి నిర్వహించేవారు. ప్రస్తుతం అమ్మాయి కుటుంబసభ్యులు, దగ్గరి బంధువులు ఇందులో ఆనందంగా డ్యాన్సులు చేస్తున్నారు. దీనికి వరుడి కుటుంబసభ్యులను కూడా ఆహ్వానిస్తున్నారు. అంతా కలిసి పరిచయ కార్యక్రమంగా నిర్వహిస్తున్నారు.

2వరోజు మెహందీ

గతంలో పెళ్లికి ముందు ఇంట్లో వారే పెళ్లికూతురికి గోరింటాకు పెట్టేవారు. ప్రస్తుతం ఇది కూడా సంబరంగా నిర్వహిస్తున్నారు. ఇంట్లో ప్రత్యేక సెట్టింగ్ వేసి ఈవెంట్స్‌వారితో పెళ్లి కూతురికి గోరింటాకు పెట్టిస్తున్నారు. వచ్చిన బంధువర్గంలో మహిళల చేతులూ గోరింటతో పండిస్తున్నారు. ఈ కార్యక్రమం జరుగుతున్నంతసేపు బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ ఉంటుంది. ఒక రోజు సరదాగా కేటాయిస్తున్నారు.

3వరోజు హల్దీ

పెళ్లికూతురికి పసుపు రాయడం ఎప్పుడూ ఉండేదే. అయితే అమ్మాయి,అబ్బాయి ఇళ్లలోనూ దీనికి హల్దీ పేరిట మంగళస్నాన కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. దీనికి కూడా భారీ సెట్టింగ్ పెడుతున్నారు. మురారి సినిమాలో మహేష్‌బాబు తరహాలో అబ్బాయిలూ ఇందుకు సై అంటున్నారు.

4వరోజు వివాహం

వివాహ ఘట్టంలో సంప్రదాయంగా వాడే వస్తువులకు ప్రత్యేక డిజైన్లు వేస్తున్నారు. వరుడిని గుర్రంపై మండపం వరకు, ఆతర్వాత ముత్యాలపందిరితో స్టేజీపైకి తోడ్కొని వస్తున్నారు. వధువును గంపలో కూర్చోబెట్టి మోసుకుని తీసుకువస్తున్నారు. ఈ సంప్రదాయంతోపాటు ఈవెంట్ ఆర్గనైజర్లు మరికొన్ని సాంస్కృతిక కార్యక్రమాలు జోడిస్తున్నారు.

5వ రోజు వ్రతం, రిసెప్షన్

చివరిగా వ్రతంతో పెళ్లి వేడుక ముగుస్తుంది. వ్రతాలకు అవసరమయ్యే వస్తువులను కూడా ఈవెంట్స్ ఆర్గనైజర్లే సమకూరుస్తున్నారు. రిసెప్షన్ పెళ్లి కంటే ఎక్కువ ఆర్భాటంగా చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి వారు అందరూ పోటీ పడి దుస్తులు ధరిస్తున్నారు. మోడరన్ లుక్‌తో దర్శనమిస్తున్నారు.

మేళతాళాల్లోనూ స్పెషలే...

వివాహాలకు సన్నాయి బృందాలు, సాధారణ బ్యాండ్ వాయించడం ఇప్పటి వరకు ఉన్న ఆనవాయితీ. ప్రస్తుతం ఇందులోనూ కొత్త ట్రెండ్ వచ్చింది. కేరళ బ్యాండు, పంజాబీబ్యాండ్‌కు క్రేజీ ఉంది.పెళ్లి ముందు జరిగే వేడుకల్లో కొన్ని సామాజిక వర్గాల ఆచారాల ప్రకారం అదనపు కార్యక్రమాలు కూడా చేస్తున్నారు. ప్రతి కార్యక్రమానికీ ఒక డ్రెస్ కోడ్ పెట్టుకుంటున్నారు.







ప్రజల అభిరుచి మేరకు..



శుభకార్యాల నిర్వహణలో ప్రజల ఆలోచనా విధానం మారుతోంది. స్టేటస్‌కు తగ్గట్టుగా వేడుక చేయాలని భావిస్తున్నారు. అవసరమైన సామగ్రి ఒకే చోట దొరికేలా చూసుకుంటున్నారు. ఈవెంట్ మేనేజ్‌మెంట్లకు మంచి ఆదరణ ఉంటోంది. పిల్లల పెళ్లి ఘనంగా చేయడానికి తల్లిదండ్రులు ఖర్చుకు వెనకాడడం లేదు. పెళ్లిల్లో అన్ని ఆచారాలు, సంప్రదాయాలు ఉండాలని కోరుకుంటున్నారు.సంప్రదాయానికి కొత్తదనం జోడించి నిండుదనం తీసుకువస్తున్నారు.

– తాతపూడి ఆనంద్, ఈవెంట్ నిర్వాహకులు, రాజమహేంద్రవరం.

ఎంతో సంతోషంగా ఉంది



మా పాపపెళ్లి వేడుక ఐదురోజులు ఆనందంగా చేశాం. టెన్షన్ లేకుండా ఈవెంట్ ఆర్గనైజర్ సహకారంతో సంప్రదాయబద్ధంగా నిర్వహించాం. దగ్గరి బంధువులు, మిత్రుల రాకతో ఒక రోజు ముందు నుంచే సందడి మొదలైంది. ఐదురోజుల పెళ్లంటే కష్టమని అందరూ చెప్పారు. కానీ పాత సంప్రదాయం మళ్లీ తీసుకురావాలనే కోరికతో కష్టమేమీ లేకుండా నిర్వహించాం.

– మేడపాటి సద్గుణరామారెడ్డి, సత్యవేణి దంపతులు,రాజమహేంద్రవరం

తక్కువ నికోటిన్ పొగాకు రకం అభివృద్ధి

ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ తిలక్‌రాజ్‌శర్మ సూచన

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్), కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ (సీటీఆర్ఐ) ద్వారా తక్కువ నికోటిన్ కలిగిన పొగాకు రకాలను అభివృద్ధి చేయాలని ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (క్రాప్‌సైన్సెస్) డాక్టర్ తిలక్‌రాజ్ శర్మ శాస్త్రవేత్తలకు సూచించారు. స్థానిక సీటీఆర్ఐలో నిర్వహిస్తున్న అఖిల భారత పొగాకు నెట్‌వర్క్ ప్రాజెక్టు 12వ గ్రూపు సమావేశాల్లో భాగంగా శనివారం ఆయన, అసిస్టెంట్ డిప్యూటీ డైరెక్టర్ డా.ఆర్‌కె.సింగ్, సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ శేషుమాధవ్‌లతో కలిసి కాతేరులోని ఐసీఏఆర్-సీటీఆర్ఐ నల్లరేగడి నేల పరిశోధనాక్షేత్రాన్ని సందర్శించారు. పొగాకు రకాల సాగు, మిరప పంట సస్య రక్షణ పద్ధతులు, పొగాకు క్యూరింగ్ బ్యారన్లు పరిశీలించారు. శ్యాస్త్రవేత్తలకు తగిన సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా డా.తిలక్‌రాజ్‌శర్మ మాట్లాడుతూ పొగాకు క్యూరింగ్ పద్ధతిలో సౌర శక్తిని ఉపయోగించి కలప వినియోగాన్ని తగ్గించాలన్నారు. సాగు, కోత అనంతరం యాజమాన్యంలో ఖర్చును తగ్గించి పొగాకును లాభసాటి సాగుగా చేపట్టాలన్నారు.

విస్తృత చర్చలు

ఐసీఏఆర్,సీటీఆర్ఐ, టుబాకో బోర్డు పరస్పర అవగాహన, అనుసంధానంతో పనిచేసి పొగాకు వాణిజ్యంలో దేశాన్ని అగ్రస్థానంలో నిలపాలని పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా.ఎ.శ్రీధర్‌బాబు ఆకాంక్షించారు. సీటీఆర్ఐ సమావేశపు హాలులో లాభసాటి ఎగుమతులు, వాణిజ్యం, ట్రేడ్‌తో సీటీఆర్ఐ అనుసంధాన కార్యాచరణపై ముఖాముఖి చర్చ జరిగింది. ఇందులో శ్రీధర్‌బాబు పాల్గొని ప్రస్తుతమున్న పొగాకు డిమాండ్‌ను గణాంకాలతో వివరించారు. సీటీఆర్ఐ డైరెక్టర్ డా.శేషుమాధవ్ మాట్లాడుతూ పొగాకు బోర్డు, ఇతర పొగాకు వాణిజ్య సంస్థల సహకారంతో పరిశోధనలను చేపడతామన్నారు. ఐసీఏఆర్ అసిస్టెంట్ డిప్యూటీ డైరెక్టర్ డా.ఆర్‌కె సింగ్ మాట్లాడుతూ ప్రైవేటు భాగస్వామ్య పద్ధతిలో పరిశోధనలు చేపడితే ఫలితాలు వేగవంతంగా వస్తాయని అభిప్రాయపడ్డారు. ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డా.తిలక్‌రాజ్‌శర్మ మాట్లాడుతూ రెండు రోజుల సమావేశాలు ఎంతో ప్రయోజనకరంగా నిలిచాయన్నారు. ముగింపు కార్యక్రమంలో పొగాకు రైతు ప్రయోజనార్థం మూడు అంశాలను సిఫార్సు చేసినట్లు సీటీఆర్ఐ డైరెక్టర్ డా.శేషుమాధవ్ తెలిపారు. ఈసందర్భంగా పలు ప్రచురణలను ఆవిష్కరించారు. ఏఐఎన్‌పీటీ కింద ఉన్న అన్ని పరిశోధన కార్యక్రమాలను ఉన్నతాధికారులు సమీక్షించారు. అనంతరం సాంకేతిక సెషన్‌లో భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేశారు.



ఏఐఎన్‌పీటీ సమావేశంలో మాట్లాడుతున్న ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డా.తిలక్‌రాజ్‌శర్మ, చిత్రంలో పొగాకుబోర్డు ఎగ్జిక్యూటివ్‌డైరెక్టర్ డా.శ్రీధర్‌బాబు, ఏడీజీ డా.ఆర్‌కె.సింగ్,సిటిఆర్ఐడైరెక్టర్ డా.శేషుమాధవ్‌లు

మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

పరిశ్రమల అధికారులతో కలెక్టర్ సమీక్ష

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): జిల్లాలో మహిళా పారిశ్రామికవేత్తల అభ్యున్నతికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ మాధవీలత చెప్పారు. సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పరిశ్రమల అనుబంధ శాఖల అధికారులతో శనివారం ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగాకలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో మొదటి దశగా 200 మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా ఎంపిక చేశామన్నారు. మార్చి మాసాంతానికి 1500 మందికి ఉపాధిని కల్పించే లక్ష్యంతో ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ప్రతి మండలం నుంచి కనీసం 10 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. మహిళా పారిశ్రామికవేత్తలకు సంబంధించి ఇప్పటికే వివిధ బ్యాంకుల వారీగా 206 దరఖాస్తులు వచ్చాయన్నారు. పీఎంఈజీపీ కింద పరిశ్రమల స్థాపనకు రుణాలు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. ఇప్పటివరకు ఎంఎస్‌ఎం



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత

ఈ ప్రోగ్రాం కింద 2,274 యూనిట్లకు రూ.369.94 కోట్లు పెట్టుబడి సమకూర్చామన్నారు. వీటి ద్వారా 9,677 మందికి ఉపాధికి అవకాశాలు లభించాయన్నారు. రూ.1,660 కోట్లతో చేపట్టిన మూడు భారీ పరిశ్రమల ఏర్పాటు వివిధ దశల్లో ఉందన్నారు. ఈ పరిశ్రమల వల్ల 2,00691 మందికి ఉపాధి కలుగుతుందని పేర్కొన్నారు. కొవ్వూరు మండలం పంగిడిలో సోలార్ గ్లాస్, నల్లజర్ల మండలం పోతవరంలో బయోటెక్నాలజీ, గోకవరం మండలం గుమ్మలదొడ్డిలో ఇన్ ఆర్గానిక్ కెమికల్స్ కంపెనీలు పనులు వివిధ దశల్లో ఉన్నాయని వివరించారు. జిల్లాలో క్లస్టర్ అభివృద్ధి ప్రోగ్రాం కింద రూ. 15 కోట్లతో 14 ఫర్నిచర్ యూనిట్లు ఏప్రిల్ నాటికి ప్రారంభించనున్ననట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సిలికాన్ కార్బన్ ప్రొడక్ట్స్ అసోసియేషన్(రాజమహేంద్రవరం) ఆధ్వర్యంలో 27 యూనిట్లకు రూ. 28 కోట్లు, గోదావరి సెర్మిక్ అండ్ రీ ఫ్యాక్టరీ అసోసియేషన్(ధవలేశ్వరం) 25 యూనిట్లకు రూ.10 కోట్లు మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రామ్ కింద జిల్లాలో ఇప్పటివరకు 486 దరఖాస్తులు వచ్చాయన్నారు. 249 యూనిట్లు మంజూరు చేశామన్నారు. 153 యూనిట్లు గ్రౌండింగ్ స్థాయిలో ఉన్నాయన్నారు. సమావేశంలో పరిశ్రమల శాఖ అధికారి వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ డైరెక్టర్ ప్రదీప్ కుమార్, జిల్లా అగ్నిమాపక అధికారి మార్టిన్ లూథర్ కింగ్, డీపీఓ జగదాంబ, మైక్రో ఇరిగేషన్ అధికారి శ్రీనివాసరావు, ఐసీఐఎఫ్, ఏపీఐఐ అధికారులు పాల్గొన్నారు.

పేరుకే గళం.. మాటల్లో అంతా విషమే

జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ మొహమ్మద్ ఆరిఫ్

సాక్షి, రాజమహేంద్రవరం: టీడీపీ నేత నారా లోకేష్ తెలుగుజాతి ఔనత్యంపై దండయాత్ర చేస్తున్నారని, మహిళలు యువకులు ఉన్న బహిరంగ సభలలో సభ్య సమాజం ఉచ్చరించజాలని తీవ్రమైన పరుష పదజాలంతో మాట్లాడం సరికాదని జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ మొహమ్మద్ ఆరీఫ్ విమర్శించారు. దిగుజారుడు రాజకీయాల్లో తండ్రిని మించిపోదా యన్నారు. పాదయాత్ర పేరుతో దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్ సంస్కారహీనమైన మాటలతోనే తెలుగు ప్రజల పరువు గంగలో కలుపుతుంటే చంద్రబాబు సొంత పుత్రుడు ఒక అడుగు ముందుకేసి మరింత నీచమైన భాష ఉపయోగించడం దారుణమన్నారు. కుల మతాలకతీతంగా అన్ని వర్గాల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా, సంతోషంగా ఉండడం చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు కేవలం చిల్లర మాటల ద్వారా తమ పబ్బం



గడుపుకోవాలని చూడటం హేయమైన చర్యగా అభివర్ణించారు. తాము అధికారంలోకి వస్తే ఏం చేస్తామో చెప్పలేక పచ్చ మీడియాను ఆసరాగా చేసుకుని విషపూరితమైన రాతలు రాయడం రాష్ట్ర ప్రజలు గమనిస్తూనే ఉన్నారని, తెలుగు ప్రజల గౌరవానికి భంగం కలిగేలా నీచ రాజకీయాన్ని కొనసాగిస్తామంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య


విజయ్ (ఫైల్)

గండేపల్లి: ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్టు గండేపల్లి ఎస్సై వై.గణేష్‌కుమార్ తెలిపారు. నీలాద్రిరావుపేటకు చెందిన కారుకొండ విజయ్ (23) మానసిక ఒత్తిడి కారణంగా ఈ నెల 26న రాత్రి గ్రామ శివారు పోలవరం కాలువ గట్టు వద్ద క్రిమి సంహారక మందును తాగాడు. వెంటనే అతన్ని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చెట్టును ఢీకొట్టిన లారీ


నాగుల్లంక వద్ద చెట్టును ఢీకొన్న లారీ

పి.గన్నవరం: మండలంలోని నాగుల్లంక గ్రామం వద్ద మట్టి లోడుతో వెళ్తున్న లారీ డ్రైవర్‌కు ఒక్కసారిగా ఫిట్స్ రావడంతో పెను ప్రమాదం తప్పింది. లారీ అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదం నుంచి డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. పెదకందాలపాలెం లంక నుంచి రాజోలు వైపు వెళ్తున్న మట్టి లోడు లారీ అదుపుతప్పి చెట్టును ఢీకొంది. స్థానికులు వెళ్లి చూసేసరికి డ్రైవర్ ఏసు ఫిట్స్ వచ్చి కొట్టుకుంటున్నాడు. అతనికి స్థానికులు సపర్యలు చేయగా కోలుకున్నాడు. ప్రమాద సమయంలో ఎదురుగా ఎవరూ రాకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

ప్రభాత సూర్యునికి ప్రణామం

- భక్తిశ్రద్ధలతో రథసప్తమి పూజలు
- ఆలయాల్లో కిక్కిరిసిన భక్తులు


ప్రత్యేక అలంకరణలో సూర్యభగవానుడు


జి.మామిడాడలో కనుల పండువగా రథోత్సవం


అన్నవరం రత్నగిరిపై పూజలు చేస్తున్న పండితులు

పెదపూడి: ప్రభాత సూర్యునికి భక్తులు పూజలు చేసి తన్మయత్వం చెందారు.. రథసప్తమి వేళ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని సూర్యనారాయణ స్వామి ఆలయాలు, ప్రముఖ దేవస్థానాలు కిక్కిరిశాయి. రాష్ట్రంలోనే ప్రసిద్ధి చెందిన పెదపూడి మండలం జి.మామిడాడ సూర్యనారాయణ స్వామివారి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. సూర్యభగవానుడి పుట్టిన రోజు కావడంతో రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరిపారు. మధ్యాహ్నం 1.30 గంటలకు అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి సతీమణి ఆదిలక్ష్మి రథోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలోనే ఈ ఆలయం ప్రసిద్ధిగాంచిందన్నారు. ఈ ఆలయానికి సుమారు 116 ఏళ్ల చరిత్ర ఉందన్నారు. దూర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దేవేరులైన ఉష, పద్మిని, ఛాయ, సౌంజ్ఞ ఉత్సవ మూర్తులతో కలసి సూర్య భగవానుడు పల్లకిలో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం ఆలయం బయట ఉంచిన రథంలో ఉత్సవ మూర్తులు ఆశీనులు అయ్యారు. తర్వాత అర్చకుల మంత్రోచ్చరణల మధ్య రథోత్సవం ప్రారంభించారు. ఆదిలక్ష్మితో పాటు ఆలయ ఉత్సవ కమిటీ, గ్రామ యూత్, భక్తులు రథాన్ని ముందుకు లాగారు. ఇదిలా ఉంటే అన్నవరం సత్యదేవుని ఆలయం రథ సప్తమి వేడుకలతో శోభాయమానంగా కనిపించింది. సత్యదేవుని వార్షిక కల్యాణ వేదికపై సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు చేశారు. పెద్దాపురం అమరగిరి మెట్టకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మహిళలు స్వామివారిని దర్శించుకుని మెట్టపై పాలు పొంగించారు. కాకినాడ భానుగుడి ప్రాంగణంలో సూర్యనారాయణ స్వామి ఆలయం భక్తులతో నిండింది.

సిద్ధమవుతున్న భీమేశ్వరుని కల్యాణ రథం


రథంపై ఏర్పాటు చేసే కళాకృతులను పరిశీలిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామికి సుమారు రూ.1.50 కోట్లతో నిర్మిస్తున్న కల్యాణ రథం సిద్ధమవుతోంది. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ సూచన మేరకు స్థపతి సింహాద్రి గణపతి ఆచార్యులు గత డిసెంబరు 18న రథ నిర్మాణ పనులు ప్రారంభించారు. శనివారం రథానికి శిఖరం, చక్రాలు అమర్చారు. మరోపక్క రథంపై అమర్చేందుకు చెక్కతో తయారు చేసిన బొమ్మలను సిద్ధం చేస్తున్నారు. మరో ఐదు రోజుల్లో రథానికి తుది రూపం ఇచ్చి ట్రయల్ రన్ వేస్తామని స్థపతి గణపతి ఆచార్యులు చెప్పారు. శనివారం పనులను మంత్రి వేణు పరిశీలించారు. వచ్చేనెల 4న రథోత్సవానికి నూతన రథాన్ని యుద్ధ ప్రాతిపదికన సిద్ధం చేస్తుండడంపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్ర కబడ్డీ పోటీల్లో చారిత్రాత్మక విజయం

ప్రథమ స్థానాల్లో
ఉమ్మడి జిల్లా పురుషులు, మహిళా జట్లు


రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ట్రోఫీ అందుకుంటున్న పురుషుల జట్టు


విజయం సాధించిన ఉమ్మడి జిల్లా మహిళా జట్టు

సామర్లకోట: అనకాపల్లి వద్ద అంకంపాలెం గ్రామంలో ఈ నెల 25 నుంచి 27 వరకూ జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పురుషులు, మహిళల జట్లు విజయం సాధించాయి. ఈ విషయాన్ని శనివారం ఉమ్మడి జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొండపల్లి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ 70వ అంతర్ జిల్లాల పురుషులు, మహిళల కబడ్డీ జట్లు రాష్ట్ర స్థాయి పోటీలలో రెండూ ఒకేసారి విజయం సాధించడం చారిత్రాత్మకమన్నారు. శుక్రవారం రాత్రి జరిగిన ఫైనల్‌లో పురుషుల జట్టు ప్రకాశం జిల్లాపై విజయం సాధించిందని చెప్పారు. అదే విధంగా మహిళల జట్టు శ్రీకాకుళంపై విజయ కేతనం ఎగురవేసిందన్నారు. పురుషుల జట్టులో కె.శ్రీనివాసు, మహిళల జట్టులో కేఎంవీ దుర్గలు మంచి ప్రతిభ కనబర్చారని చెప్పారు. విజయం సాధించిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్లను ప్రొ కబడ్డీ రిఫరీ బోగిళ్ల మురళీకుమార్, ఉమ్మడి జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ తోట బాబు, వైస్ ప్రెసిడెంట్లు ఎస్.కిరణ్, వి.శ్రీనివాస్, సహాయ కార్యదర్శులు వి.మాచారిరావు, కె.ప్రభువరప్రసాద్, కోశాధికారి తాళ్లూరి వైకుంఠం అభినందించారు.

సీఎం జగన్‌తో సంక్షేమ స్వరాజ్యం


కొంకుదురులో మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణరెడ్డి విగ్రహావిష్కరణ చేసిన స్పీకర్ తమ్మినేని సీతారామ్, పక్కన ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి

- శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారామ్
- మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణరెడ్డి విగ్రహ ఆవిష్కరణ

బిక్కవోలు: సీఎం జగన్ పాలనలో రాష్ట్రానికి సంక్షేమ స్వరాజ్యం వచ్చిందని శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారామ్ అన్నారు. శనివారం కొంకుదురులో మాజీ ఎమ్మెల్యే పడాల సత్యనారాయణరెడ్డి, ఆయన కుమారుడు, విద్యావేత్త పాపారావు విగ్రహాలను తమ్మినేని సీతారామ్‌తో పాటు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ఆవిష్కరించారు. అనంతరం డిజిటల్ లైబ్రరీని ప్రారంభించారు. స్పీకర్ తమ్మినేని మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను పొందుతూ వాటిపై విమర్శలు చేయడం ప్రతిపక్ష నాయకులకు సరికాదన్నారు. గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని సంక్షేమ పథకాలను ఇప్పుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారన్నారు. టీడీపీ, జనసేన ఇంకా ఎన్ని పార్టీలు కలిసినా వైఎస్సార్ సీపీని ఏమీ చేయలేరని అన్నారు. అనపర్తి నియోజకవర్గానికి మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణరెడ్డి చేసిన సేవలు మరిచి పోలేమన్నారు. ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఇటువంటి మహనీయుల విగ్రహాలు ఆవిష్కరించడం సంతోషదాయకమన్నారు. వారు చేసిన సేవలను అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వారి కుటుంబ సభ్యులు గ్రామానికి డిజిటల్ గ్రంథాలయ ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ కొంకుదురు గ్రామంతో తనకు విడదీయరాని అనుబంధం ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం ఖాయమన్నారు. అనంతరం స్పీకర్ దంపతులను ఘనంగా సత్కరించారు. ముందుగా బలభద్రపురం పంచాయతీ కానేడు గ్రామంలో శ్రీలక్ష్మీ వెంకటేశ్వర హైజినిక్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను స్పీకర్ ప్రారంభించారు. జిల్లా మహిళా సంక్షేమ సంఘ చైర్‌పర్సన్ రొంగల పద్మావతి, రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిళారెడ్డి, ఏఎంసీ చైర్మన్ సబెళ్ల కృష్ణారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ జంగా వీరవెంకట సుబ్బారెడ్డి, సర్పంచ్ సత్తి వీరమణి, ఎంపీటీసీ కొంకుదురు పీవీ, నల్లమిల్లి అమ్మిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి రాజా, గజల్ శ్రీనివాస్, డాక్టర్ సత్తి వీర్రెడ్డి, స్పీకర్ ప్రత్యేక అధికారి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

THE ANDHRA PRADESH STATE CIVIL SUPPLIES CORPORATION LIMITED
DISTRICT OFFICE, COLLECTORATE COMPOUND
EAST GODAVARI DISTRICT, RAJAMAHENDRAVARM

EMPLOYMENT NOTIFICATION

No:P.Admn.A2/12/2015 Date: 29.01.2023.

Applications are invited from the interested and eligible local candidates (newly formed East Godavari District jurisdiction only) for recruitment of personnel in the cadre of Accountant Gr-III on contract basis for a period of ONE YEAR to work in APSCSCL East Godavari District through District Selection Committee headed by the Joint Collector & EOED. The details are as follows:

Sl. No.	Name of the Posts	No. of Posts	Qualifications prescribed	Experience	Consolidated monthly remuneration	Maximum Age limit
1	Accountant Grade III (on Contract basis for a period of ONE Year)	02	1. CA/CMA Semi Qualified i.e. Inter Passed 2. Computer Skills.	02 Years experience in relavant field	Rs.30,000/- per month	a)General: 35 years b)Reserved: 40 years

The interested Local candidates can send their applications to the District Civil Supplies Manager Office, APSCSCL, Collectorate compound, East Godavari District Rajamahendravaram on working days only through Registered post or person and the last date for receipt of applications is 07.02.2023 upto 5.00 PM and verification of Original Certificates will be on 08.02.2023.

Date: 29.01.2023 Sd/- COLLECTOR & DISTRICT MAGISTRATE
Place: Rajamahendravaram EAST GODAVARI DISTRICT

బైక్‌పై వెళ్తుండగా భర్తకు గుండెనొప్పి

- భార్య ఎదుటే కుప్పకూలి మృతి
- తాళ్లరేవు మండలం గోపులంక వద్ద ఘటన


ఉపాధ్యాయుడు ప్రసాద్‌బాబు (ఫైల్)

తాళ్లరేవు: ఏడడుగుల బంధం వీడిపోయింది.. భార్య ఎదుటే భర్త మృతి చెందిన ఘటన అందరినీ కలచివేసింది.. రోజూ మాదిరిగా భార్యను బైక్‌పై పాఠశాలకు తీసుకు వెళుతుండగా భర్త గుండెనొప్పితో మృతి చెందిన ఘటన శనివారం తాళ్లరేవు మండలం గోపులంకలో చోటు చేసుకుంది. ఈ ఘటన కుటుంబ సభ్యుల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. ఆ వివరాల్లోకి వెళితే.. కె.గంగవరం మండలం పేకేరు శివారు భీమ్‌నగర్ గ్రామానికి చెందిన భార్యాభర్తలు పొన్నమళ్ల ప్రసాద్‌బాబు, సత్య పుష్పవాణి ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. ప్రసాద్‌బాబు కె.గంగవరం మండలం భట్లపాలిక శివారు రావిదొడ్డిపేట పాఠశాలలో పనిచేస్తుండగా, సత్య పుష్పవాణి తాళ్లరేవు మండలం నీలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఎస్ టీచర్‌గా సేవలందిస్తున్నారు. రోజూ మాదిరిగానే ఇద్దరూ పాఠశాలకు బైక్‌పై బయలుదేరారు. తొలుత భార్యను నీలపల్లి హైస్కూల్‌కు తీసుకువచ్చేందుకు ఏటిగట్టు రహదారిలో వస్తుండగా గోపులంక వద్దకు వచ్చేసరికి అకస్మాత్తుగా ప్రసాద్‌బాబు తల తిరుగుతుందని పుష్పవాణికి చెప్పడంతో బైక్‌ను పక్కనే ఆపమని తెలిపింది. బైక్‌పై నుంచి కిందకు దిగి స్టాండ్ వేసేలోపే ఒక్కసారిగా కుప్పకూలిపోయి అతను మృతి చెందాడు. పుష్పవాణి పక్కనే ఉన్న గడ్డివాముపై పడడంతో పెను ప్రమాదం తప్పింది. కళ్లెదుటే భర్త మృత్యువాత పడడంతో ఆమె బోరున విలపించింది.

భీమ్‌నగర్‌లో విషాదఛాయలు

కె.గంగవరం: ఉపాధ్యాయుడు ప్రసాద్‌బాబు మృతితో భీమ్‌నగర్‌లో విషాదచాయలు అలుముకున్నాయి. వీరికి ఇద్దరు అబ్బాయిలు, ఒక అమ్మాయి ఉన్నారు. అమ్మాయి బీడీఎస్, ఒక అబ్బాయి ఇంజినీరింగ్ చదువుతున్నాడు. ఇలా ఉండగా మరొక కుమారుడు దివ్యాంగుడు.